హరహర మహాదేవ శంభో శంకర

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి భస్మాభిషేకం


కార్తీక మాసం..





కీసర: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, భస్మాభిషేకం చేశారు. కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో కీసరగుట్టకు చేరుకున్నారు. శివ నామస్మరణతో కీసరగుట్ట పరిసరాలు మార్మోగాయి. భక్తిప్రపత్తులతో కొండపై ఉన్న శివ లింగాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం కీసరగుట్ట కింద ఉన్న హుడా పార్కుతో పాటు గుట్ట పరిసరాల్లో కార్తీక వనభోజనాల సందడి కనిపించింది. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

మూడో సోమవారం



భక్తి ప్రపత్తులు.. సామూహిక వ్రతాలు



కార్తీక మూడో సోమవారాన్ని పురస్కరించుకొని అలియాబాద్ చౌరస్తాలోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. 35మంది దంపతులు ఈ పూజలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు పల్లె జ్యోతిసీతారాములు గౌడ్, ఆలయ వేదపండితుడు తిరుమల మనోహర ఆచార్య తెలిపారు. – శామీర్‌పేట్

గ్రూప్‌-3 పరీక్షకు 74.85శాతం మంది గైర్హాజరు

మేడ్చల్: మేడ్చల్ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రూప్‌-3 పరీక్షా కేంద్రాల్లో సోమవారం పరీక్షలు ప్రశాతంగా ముగిశాయి. మేడ్చల్, పేట్‌బషీరాబాద్‌ల పరిధిలో ఎంఆర్‌ఐటీ 1, 2, మర్రి లక్ష్మణ్‌రెడ్డి కళాశాల, హితం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుత్బుల్లాపూర్, సాయితేజ జూనియర్ కళాశాల, శివశివాని కళాశాల, స్ఫూర్తి జూనియర్ కళాశాల, ఎస్ఎస్ ఆర్, జాగృతి, అక్షర, గాయత్రి, అయతి, క్రిక్ స్కూల్, సెయింట్ అంథోని కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. మొత్తం 21కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 11,404 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 2868 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 25.15 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలు రాయగా 74.85 శాతం మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తం మీద రెండో రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

కులగణన సర్వే తనిఖీ చేసిన కలెక్టర్



ఘట్‌కేసర్‌లో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాధికాగుప్తా, చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను జిల్లా కలెక్టర్ రాధికాగుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి మున్సిపాలిటీలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వేపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ ఉన్నతికి ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో ఇన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పూర్తి సమాచారం నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మల్లారెడ్డి, జంగయ్య యాదవ్, సంజీవరెడ్డి, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ కార్యకర్తల నిరసన



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా కమిటీలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘాల జిల్లా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. దీనికి ముందు కలెక్టరేట్ ఎదుట రెండు సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీర్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద పేద బడుగు బలహీన పిల్లలు చదువుకుంటున్నారని పేర్కొన్నారు.

◆ ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టటం వల్ల దళిత,గిరిజన విద్యార్థుల చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు భోజన వసతి కల్పించకుండా వారి తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద బకాయి పడిన డబ్బులను చెల్లించేలా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వడానికి దాదాపు 3గంటల పాటుగా కలెక్టరేట్ ఆఫీస్‌లో కూర్చున్నామని అనినారు. వినతి పత్రాలు సమర్పించటం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కర్ణాకర్, నందీశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కరాటే నేర్చుకోవాలి

బోడుప్పల్: యువతీయువకులు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, లీగల్ సలహాదారులు మిట్ట నర్సయ్యగౌడ్ అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫ్యూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించేందుకు కృషి చేయాలని, అందుకు ప్రభుత్వాలు తమవంతు కృషి చేస్తున్నాయన్నారు. ఈ పోటీల్లో ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 12 ఏళ్ల లోపు చాంపియన్‌షిప్ పోటీల్లో వరుణ్ ప్రథమస్థానంలో నిలవగా, 12 ఏళ్లు పైబడిన పోటీల్లో జగత్ మొదటి స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్ ఆర్గనైజర్ నంద ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు తోటకూర రవీందర్‌యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు. 33/11 కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్ 11 కేవీ డెంటల్ కాలేజీ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 4:30 వరకు లక్ష్మీనగర్, సేవాలాల్ తండా, ఆర్మీ డెంటల్ కాలేజీ, సీఎస్ఐ చర్చి మల్కారం, భగత్‌సింగ్ కాలనీ, భాగ్యనగర్, మామిడితోట, శ్రీకృష్ణపురి కాలనీ, గబ్బిలాల్‌పేట, శాంతినగర్, రాజీవ్‌గాంధీనగర్, చెన్నాపురంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

శామీర్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో..

శామీర్‌పేట్: శామీర్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ రాఘవేందర్‌రావు తెలిపారు. 33/11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కండ్లకోయ ఫీడర్ పరిధిలో..

మేడ్చల్‌రూరల్: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతోందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కండ్లకోయ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ, సుతారిగూడ, రైల్వేగేట్, ఆఫీసర్స్ కాలనీ, కండ్లకోయ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

అన్నోజిగూడ ఫీడర్ పరిధిలో..

పోచారం: అన్నోజిగూడ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. అన్నోజిగూడ, ఎల్ఎస్‌కాలనీ, ఎల్‌ఐజీ, జైపురికాలనీ, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్ ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్‌జీఓస్‌కాలనీ ఫీడర్ పరిధిలో..

మేడ్చల్: పట్టణంలోని ఎన్‌జీఓస్‌కాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ రాంబాబు తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీ, రాఘవేంద్రనగర్‌కాలనీ, కిష్టాపూర్ రోడ్డు, పోలీస్‌స్టేషన్ ప్రాంతాలలో ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న వజ్రేష్ యాదవ్

పోచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అన్నోజిగూడకు చెందిన బాలగోని చిన్న నర్సింహగౌడ్‌కు మంజూరైన రూ.60వేల చెక్కును టీపీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటిక్యాల కృష్ణారెడ్డి, నాయకులు సగ్గు శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ అటెండర్ శివకుమార్‌కు నివాళి

రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపిన ఉద్యోగులు



సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్‌లో అటెండర్ (ఔట్ సోర్సింగ్) పని చేస్తున్న శివకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం పట్ల డీఆర్‌ఓ హరిప్రియ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో కలెక్టరేట్ అటెండర్ శివకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ హరిప్రియ మాట్లాడుతూ అందరితో కలసిమెలసి నడుచుకునే అటెండర్ శివకుమార్ మృతి చెందటంపై విచారాన్ని వ్యక్తం చేశారు. బాధ్యతగా విధులు నిర్వర్తించే శివకుమార్ మృతి చెందారంటే నమ్మలేక పోతున్నామని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి శివకుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాంమోహన్‌రావు, వివిధ శాఖల ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. దీనికి ముందు కలెక్టరేట్ అటెండర్ శివకుమార్ మృతికి సంతాప సూచకంగా ఉద్యోగులు,సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

తూతూ మంత్రంగా ప్రజావాణి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయని, డీసీ రాజు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 3 , ఇంజినీరింగ్ విభాగంలో 2 , రెవెన్యూ విభాగంలో 2 , యూసీడీ ,వెటనరీ సెక్షన్‌లో ఒక్కొక్క ఫిర్యాదు అందాయని, వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజావాణి సమయంలో ఇతర సమావేశాలు ఏర్పాటు చేయకూడదని, అలాంటిది కుటుంబసర్వేపై గంటలకు పైగా సమావేశం నిర్వహించడంతో ప్రజలు బయటనే ఉన్నారని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. తాను వెళ్లి అడిగితే లోపలికి అనుమతించారన్నారు. ప్రజావాణి కార్యక్రమం తూతూ మంత్రంగానే జరుగుతోందని విమర్శించారు. అధికారులు హాజరుకావడం లేదంటే వారికి విధుల పట్ల ఉన్న బాధ్యత తెలియజేస్తుందని, న్యాక్ నుంచి వచ్చిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహించడం మానేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం షురూ



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో నెక్స్ట్ జెన్ వీఎల్ఎస్ఐపై వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. జేఎన్‌టీయూహెచ్ ప్రొ. సత్యసావిత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నేటి సమాజంలో టెక్నాలజీ ఎంతో ముఖ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం వీఎల్ఎస్ఐ డిజైన్, సెమి కండక్టర్స్‌పై నిధులు వెచ్చిస్తోందని వీటిని కేవలం ఈసీఈ విద్యార్థులు మాత్రమే ఉపయోగించుకోగలరని తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, రవికుమార్, రాజేశ్, రవింద్రబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలతో అనుమతించలేదని..

స్కూల్ ఎదుట నిరసన

మల్లాపూర్: అయ్యప్ప మాలతో స్కూల్‌కు విద్యార్థులకు అనుమతించలేదని తల్లిదండ్రులు హిందూ సంఘాలతో కలిసి నిరసన చేపట్టారు. అయ్యప్ప మాల వేసిన ఇద్దరు విద్యార్థులు నాచారం సెంట్ ఫీటర్స్ స్కూల్లో చదువుతున్నారు. కాగా మాల ధరించి వారు స్కూల్‌కు వెళ్లడంతో యాజమన్యం అనుమతిలేదని బయటికి పంపింది. దీంతో అయ్యప్ప మాలదారులు స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ పాఠశాల వద్దకు వచ్చి పాఠశాల యాజమాన్యంతో మాట్లాడటంతో ఆందోళన విరమించారు.

మెడికల్ షాపులో అగ్నిప్రమాదం

ఉప్పల్: ఉప్పల్ శాంతినగర్‌లోని మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ శాంతినగర్‌లో వేముల సాయి చైతన్య ఉప్పల్ శాంతినగర్‌లో దీపిక మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి యధావిధిగా షాపునకు తాళం పెట్టి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో స్థానికుడు నరేష్‌కు ఫోన్‌చేసి మెడికల్ షాపులో నుంచి పొగలు వస్తున్నాయని సమాచారం ఇవ్వడంతో వెంటనే చైతన్య షాపు వద్దకు వచ్చాడు. అప్పటికే మంటలు అంటుకున్నాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ మేరకు బాధితుడు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాల తొలగించేందుకు వెళ్లిన అధికారులతో వాగ్వాదం చేస్తున్న నిర్మాణదారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కాచగూడలో ప్రభుత్వ స్థలంలో నెలకొన్న అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నం .30లోని 4.23 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం మేడ్చల్ రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేసేందుకు అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లగా నిర్మాణదారులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తాము ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టలేదని వారు తెలుపగా అధికారులు ప్రభుత్వ స్థలమేనంటూ వివరించారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పేట్‌బషీరాబాద్ పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు పలు నిర్మాణాలను జేసీబీ సాయంతో తొలగించారు. సర్వే అనంతరం మరిన్ని నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు తహసీల్దార్ శైలజ తెలిపారు.

గంజాయి ముఠా అరెస్ట్

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 10 కిలోల గంజాయిని అల్వాల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కానాజిగూడ గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో ఆదివారం గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేయగా.. ఆరుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. ముగ్గురి వద్ద 10 కిలోల గంజాయి లభ్యమైంది. ఆంధ్రప్రదేశ్ అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. విక్రయిస్తున్న నిందితులు శేఖర్ (28), రవినాయక్ (25), మధుసూదన్ (25)లు ఉండగా.. కొనుగోలు చేస్తున్న వారు కల్యాణ్ (23), రాజు (24), నరేష్ (25)లు ఉన్నారు. వీరందరు హస్మత్‌పేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

లేఔట్‌ల కాపీలను పరిశీలించిన హైడ్రా అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం హైడ్రా అధికారి (ఏఈ స్థాయి అధికారి) సర్వే నం. 145, 146, బాలాజీ ఎన్‌క్లేవ్ లేఔట్, రాజ్‌సుఖ్‌నగర్ లేఔటు, శ్రీపురంకాలనీ లేఔట్ కాపీలను పరిశీలించారు. గత బుధవారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్ లేఔట్‌లో చూపిన 40 ఫీట్ల(40 అడుగులు) రహదారిని కబ్జాచేసి సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారని స్థానిక కాలనీల ప్రజలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

◆ ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు జేసీబీ సహాయంతో సదరు ప్రహరీని హైడ్రా అధికారులు కూల్చివేసిన విషయం విదితమే. ఇదే విషయమై నాగారానికి చెందిన పాపిరెడ్డి 1979లో ఏర్పాటైన శ్రీపురం (సర్వే నంబర్లు 146,147, 148) కాలనీ లేఔట్‌లోని 112 ప్లాట్‌ను తాను కొనుగోలు చేశాడు. అన్ని అనుమతులు తీసుకొని ప్రహరీ నిర్మించినట్లు తన ప్లాట్‌ను 40 అడుగుల రహదారిగా పేర్కొంటూ ప్రహరీని కూల్చివేయడంపై అభ్యంతరం తెలిపారు.

◆ దీంతో హైడ్రా అధికారులు సోమవారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో రెండు లేఔట్ల కాపీలను క్షుణంగా పరిశీలించారు. నివేదికను హైడ్రా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారి తెలిపారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ పంబాల సరితారమేష్, వేణుగోపాల్, తదితరులు కుడా మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని 40 అడుగుల రహదారి ఉన్న లేఔట్ కాపీని అధికారులకు అందజేశారు.

కనులపండువగా అయ్యప్ప మహాపడిపూజ



పడిపూజలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, భక్తజన సందోహం



కుషాయిగూడ: కుషాయిగూడ పారిశ్రామికవాడలోని అన్నపూర్ణ ఎస్టేట్‌లో అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో 28వ అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. గురుస్వామి వాసిరెడ్డి శివప్రసాద్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పడి పూజలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లు పాల్గొని పూజలు చేశారు. కేరళ సాంప్రదాయ పద్ధతిలో 18 పడి మెట్లను ఏర్పాటు చేసి వైభవంగా పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వాముల భజనలు, అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, గురుస్వాములు రఘు, శ్రీనివాసరావు, శివ గంగాధర్, మధుకర్‌రెడ్డి వీరశేఖర్, అమర్‌నాథ్, రామారావు, సాంబశివరావు, అశోక్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, విష్ణుమోహన్‌రావు, మల్లికార్జున్‌రెడ్డి, గడ్డమీది బాలరాజుగౌడ్, లక్కిడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో రూ.5 కోట్లతో మార్కెట్‌యార్డ్



జవహర్‌నగర్‌లోని మార్కెట్‌యార్డ్‌లో తహసీల్దార్ సుచరితతో కలిసి స్థల పరిశీలనకు వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్

- మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్
- కాప్రా తహసీల్దార్ సుచరితతో కలిసి స్థల పరిశీలన

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 కోట్ల వ్యయంతో మార్కెట్‌యార్డ్‌ను ఏర్పాటు చేస్తామని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కాప్రా తహసీల్దార్ సుచరితతో కలసి పలు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్‌లోని సర్వే నం.585/2, 596/2, 612/2, 613/2, 614/2లలో దాదాపు ఐదెకరాల స్థలాన్ని సందర్శించి గుర్తించారు.

◆ అనంతరం వారు మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ఎక్కువ శాతం నిరుపేదలు ఉన్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో అనువైన స్థలంలో కూరగాయల మార్కెట్‌యార్డ్‌ను ఏర్పాటు చేసి సుందరీకరించడానికి రూ.5 కోట్లను వెచ్చించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసిన తర్వాత పనులు ప్రారంభించి మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

◆ జవహర్‌నగర్‌లో దాదాపు రెండు లక్షల మంది నివసిస్తున్నారని పేర్కొన్నారు. వారందరికీ అందుబాటులో మార్కెట్‌యార్డ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. అన్ని హంగులతో ప్రజల కోసం ఈ మార్కెట్‌ను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కాప్రా సర్వేయర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్

యాంటీబయోటిక్స్ వాడకం తగ్గించాలి



అవగాహన ర్యాలీలో సీఎంఆర్ మెడికల్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: ప్రజలు యాంటీబయోటిక్స్ వాడకాన్ని తగ్గించాలని సీఎంఆర్ మెడికల్ కళాశాల ప్రొ. డా. సురేశ్ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారంలో భాగంగా కండ్లకయలో మైక్రో బయోలజీ విభాగం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏటా 7లక్షల మంది యాంటీబయోటిక్స్ ఎక్కువగా వాడటంతో మరణిస్తున్నారని అన్నారు. 2050 నాటికి మరణాల సంఖ్య కోటికి చేరే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు వీలైనంత వరకు యాంటీబయోటిక్స్ వాడకం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అలీబేగ్, డీన్ వెంకటరమణయ్య, మేనేజర్ దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, ఎంబీబీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.